క్లుప్తంగా

ఎన్టీపీసీలో వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. శనివారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద ఎస్సై ఉదయ్‌కిరణ్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతిరోజూ వాహనాల తనిఖీ చేపడుతునట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తులను, పార్టీలను కించపరిచే వ్యాఖ్యలు చేయొద్దని సూచించారు. వాహనాలు తనిఖీ చేసే సమయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత




నగదు అందజేస్తున్న యువసేన సభ్యులు

కమాన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన తోటపెల్లి భూమయ్య క్యాన్సర్‌తో కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు సేకరించిన రూ. 42వేలను తోటపల్లి భూమయ్యకు శనివారం అందజేశారు. భూమయ్య కొన్నిరోజుల నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. అయితే భూమయ్య రజక కుటుంబానికి చెందిన నిరుపేద. వైద్యం చేయించుకోలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు సోషల్ మీడియా ద్వారా సేకరించిన డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువసేన వ్యవస్థాపకులు జంగెపెల్లి శ్రీనివాస్, అధ్యక్షుడు జంగెపెల్లి సతీశ్, అజయ్, మచ్చగిరి రాము, శ్రీనివాస్, రవి ఉన్నారు.

నగదు స్వాధీనం

పాలకుర్తి: బసంత్‌నగర్ క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మంచిర్యాల జిల్లా భీమారంకు చెందిన తాళ్ళ శశికుమార్ ఎలాంటి రశీదులు లేకుండా రూ.61,760 నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై స్వామి తెలిపారు. అలాగే జూలపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లారపు శ్రీనివాస్ నుంచి రూ.లక్ష స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న నగదును ఎఫ్ఎస్‌టీ బృందానికి అప్పగించనున్నామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా డ్రోన్‌లు వినియోగించొద్దు ఎన్నికల కోడ్ నేపథ్యంలో బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ల ఎగిరివేతపై నిషేధాజ్ఞలు విధిస్తున్నట్లు ఎస్సై స్వామి ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా శుభకార్యాలు, ఇతరత్రా కార్యక్రమాలకు డ్రోన్లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న సంస్థ సభ్యులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో నివాసముండే పేద కుటుంబానికి చెందిన చిలుముల రాయమల్లు, శాంత దంపతుల కూతురు అనూష పెళ్లికి ఆర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్ సంస్థ సభ్యులు శనివారం రూ.25వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంఘాల నాయకులు దయానంద్‌గాంధీ, డ్యాన్స్ మాస్టర్ సర్వేష్, ప్రవీణ్, సంతోష్, షేక్ హజ్రత్ పాషా, బూడిద హర్ష పాల్గొన్నారు.

గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న యూత్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలించాలని పార్టీ యూత్ జిల్లా ప్రెసిడెంట్ జెమిని గౌడ్ కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్లో మాట్లాడారు. దేశంలోని యువతకోసం రాహుల్‌గాంధీ వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నారన్నారు. దానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కాలనీ కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ హరహర నాయక్, వెంకటేశ్, అఖిల్, గౌతమ్, మారుతి, రవి, విజేందర్, హరిదాస్ పాల్గొన్నారు.

దుమ్ముతో వేగలేకపోతున్నాం

- రోడ్డు పనులు పూర్తి చేయాలని కాలనీవాసుల డిమాండ్



అశోక్‌నగర్ వద్ద కొనసాగుతున్న రోడ్డు పనులు

సుల్తానాబాద్: పట్టణంలోని గట్టెపల్లి వెళ్లే రాహదారిలో శాంతినగర్, అశోక్ నగర్ మీదుగా రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాహనాల రాకపోకలతో విపరీతమైన దుమ్ము వచ్చి చేరుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులు చేస్తున్నప్పటికీ నీటి క్యూరింగ్ చేయకపోవడంతో ఇళ్లలోకి వస్తున్న కంకర రాళ్లు, దుమ్ముతో వేగలేక పోతున్నామని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు వెళ్తుండగా బండరాళ్లు వచ్చి తగలడంతో పలువురికి గాయాలయ్యాయని, వెంటనే పనులు పూర్తయ్యేలా రోడ్లు భవనాలశాఖ అధికారులు చూడాలని కోరుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ధీమా వ్యక్తం చేశారు. ఎలిగేడు మండలంలోని రాములపల్లిలో శనివారం జరుగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద కూలీలను కలిసి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే సీఎం రేవంత్ అమలు చేస్తున్నారన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిగుర్తుపై ఓటు వేసి పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కూలీలను అభ్యర్థించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, వెంకట్‌రెడ్డి, రమేశ్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

సుల్తానాబాద్‌రూరల్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సుల్తానాబాద్ మండలం నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్, సతీశ్, మహేందర్, పన్నాల రాములు, సాగర్‌రావు, రాజాగౌడ్ ఉన్నారు.

నీళ్ల సమస్య పరిష్కరించాలి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కొదురుపాక, దేవునిపల్లి గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే విజయరమణారావును నీళ్ల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొదురుపాక (వాగుఒడ్డుపల్లి), దేవునిపల్లిలో తాగునీటి కోసం 20రోజులుగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: ప్రజలకు తాగునీటిని అందిస్తున్న మినరల్ ప్లాంట్ యజమానులు స్వచ్ఛత, పరిశుభ్రత పాటిస్తూ నిబంధనల మేరకు వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వాటర్‌ప్లాంట్ యజమానులతో సమావేశమై పలు సూచనలు చేశారు. తాగునీటిని సరఫరా చేసే క్యాన్లు పరిశుభ్రంగా, నాణ్యతగా ఉండాలన్నారు. ప్యూరిఫైడ్ చేసిన తాగునీటినే సరఫరా చేయాలన్నారు. వాటర్‌ప్లాంట్లపై ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు శ్రీశైలం, రమాకాంత్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

కమాన్‌పూర్: పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి, ఉప్పరి శ్రీనివాస్, బాద్రపు మల్లేశ్, గుర్రం లక్ష్మిమల్లు, మేకల సంపత్, ఆకుల గట్టయ్య, కొండ వెంకటేశ్, నీలం శ్రీనివాస్, సరిత, రాసకొండ రవి, పిట్టల తిరుపతి, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, గసిగంటి అజయ్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంకకు సన్మానం



సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ బాధ్యులు

సుల్తానాబాద్: బదిలీపై వెళ్తున్న సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంకను శనివారం రాత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములుగౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏపీపీ శ్యాంసుందర్‌రావు, ఏజీపీ మేకల తిరుపతిరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

'కొప్పుల' గెలవాలని..



మోకాళ్లపై గుడిమెట్లు ఎక్కుతున్న మమత

ధర్మారం: పెద్దపల్లి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అధిక మెజార్టీతో గెలుపొందాలని ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామానికి చెందిన మర్రి మమత శనివారం మోకాళ్లపై గుడిమెట్లు ఎక్కింది. ఖిలావనపర్తిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మెట్ల ద్వారా మోకాళ్లపై గర్భగుడి వరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసింది.

ఆర్థిక వ్యవస్థలో న్యాయ్ యాత్ర కీలకం

జ్యోతినగర్: రాహుల్‌గాంధీ చేపట్టిన న్యాయ్ యాత్ర మన ఆర్థిక వ్యవస్థలో కీలకమైనదని ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా శనివారం ప్రకటనలో అన్నారు. మన దేశ కార్మికులు, రైతుల హక్కులు, సంక్షేమం కోసం కాంగ్రెస్, ఐఎన్టీయూసీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్మిక వర్గం, రైతులు, సాధారణ ఓటర్లు పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఫార్మా కంపెనీ జాబ్‌మేళాకు స్పందన

జూలపల్లి: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ నిరుద్యోగులకు శనివారం మండల కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు, ఐదురౌండ్లలో ఉత్తీర్ణులైన యువతను ఎంపిక చేయనున్నట్లు కంపెనీ హెచ్‌ఆర్‌లు రాజశేఖర్, రాంబాబు పేర్కొన్నారు. ఎంపికై న యువతకు ఉద్యోగంతో పాటు ఉచితంగా బిట్స్‌పిలానీలో చదువుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముత్తారం: మండలంలోని రామకృష్ణాపూర్(ఇప్పలపల్లి)కి చెందిన చింతపండు నవీన్(22) అనే యువకుడు కరీంనగర్ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. నవీన్ మంథనిలో ఓ మెడికల్ షాపులో పనిచేస్తూ ఈనెల 22న ఇంటికి తిరుగు ప్రయాణంలో రామకృష్ణాపూర్‌లో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఎలిగేడు: మండలంలోని నర్సాపూర్‌కు చెందిన యాదగిరి శ్రీనివాస్(47) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 20న రాత్రి తాగి, ఇంటి ఎదుట పడిపోయాడు. కానీ ఎలాంటి గాయాలు లేకపోవడంతో కుటుంబసభ్యులు ఇంట్లోకి తీసుకెళ్లారు. మరుసటిరోజు ఉదయం అతను వాంతులు చేసుకోగా కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా వెన్నెముకకు బలమైన దెబ్బ తగిలి, మెదనరాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. 26న ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం చనిపోయాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'నన్ను బహిష్కరించే అర్హత వారికి లేదు'

గోదావరిఖని: 'నన్ను యూనియన్ నుంచి బహిష్కరించే అర్హత సాధినేని వెంకటేశ్వర్‌రావుకు లేదు' అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్ అన్నారు. శనివారం ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శిగా కేంద్ర కమిటీ కార్యదర్శి చంద్రన్న నాయకత్వంలో పనిచేస్తున్న తనను బహిష్కరించే అర్హత లేదన్నారు. పార్టీ నుంచి బయటకు వెళ్లి మరోవర్గాన్ని ఏర్పాటు చేసుకున్న సాధినేని వెంకటేశ్వరరావు చేస్తున్న చర్యలు, అతని విధానాలు ప్రతిఘటన పోరాటానికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఈ విషయంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. సమావేశంలో నాయకులు బి.గోపినాథ్, దాముక లచ్చన్న, కాంతయ్య, ఎల్.బీమయ్య, ఎండీ అన్వర్, రమేశ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మల్యాలలో వరిపొలం దగ్ధం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాలలో శనివారం గ్రామానికి చెందిన పంజాల శంకర్ గౌడ్‌కు చెందిన ఎకరం వరిపొలం మంటలంటుకొని కాలి బూడిదయింది. ఈ ఘటనలో సుమారు రూ.30వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ఎస్సై ఓంకార్‌యాదవ్, ఆర్ఐ ఉదయశ్రీ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధిత రైతుకు పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమతో పాటు 1994–95లో పదో తరగతి కలిసి చదివిన కొత్తూరు గ్రామానికి చెందిన భూక్య రాజేశం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని రూ.10వేలు అందజేశారు. మిత్రులు భాస్కర స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున సాయం అందించారు. మిత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, ముజ్జు పాల్గొన్నారు.

వీవోఏను తొలగించాలి

ధర్మారం: మండలంలోని నర్సింగపూర్ గ్రామ వీవోఏ గుండేటి సంధ్యను తొలగించాలని ఆ గ్రామ మహిళా సంఘాల సభ్యులు ఏపీఎం తులసికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వశక్తి సంఘం మహిళలతో వీవో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీఎంతో పాటు సీసీ అనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా 2013 నుంచి 2024 వరకు గ్రామంలోని 37 మహిళా సంఘాల ఆదాయ వ్యయాలతో పాటు వరిధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా వచ్చిన ఆదాయ వివరాల లెక్కలను చూశారు. వివిధ రకాల ఆదాయ, వ్యయాలపై చర్చించారు. మహిళా సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు వీవోఏ సంధ్యను తొలగించాలని పై అధికారులకు సిఫారసు చేస్తానన్నారు. అంతేకాకుండా ఇక్కడ జరుగుతున్న విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏపీఎం హామీ ఇచ్చారు.

క్రీసెంట్ వార్షిక వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ క్రీసెంట్ పాఠశాలలో శనివారం వార్షిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, క్రీసెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఆయాజ్, ప్రిన్సిపాల్ సయ్యద్ నసీర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



పైప్‌లైన్ పనులు చేపిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ఎండాకాలంలో పల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో అత్యవసర పనులను యుద్ధ ప్రాతిప్రదికన చేపట్టారు. పెద్దపల్లి మండలం పాలితంలో పైప్‌లైన్ వేయించే పనులు పురోగతిలో ఉన్నాయి. రాగినేడు, అందుగులపల్లి, గోపయ్యపల్లి తదితర గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించి తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. ఎంపీవో సుదర్శన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉన్నారు.

మేడే వారోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో మేడే వారోత్సవాలను విజయవంతం చేయాలని జీఎల్‌బీకేఎస్ నాయకులు కోరారు. శనివారం జీడీకే-11, 2ఏ గనులపై పోస్టర్ విడుదల చేశారు. ప్రపంచ కార్మిక పోరాట దినోత్సవం మేడే వారోత్సవాలను అన్ని గనులు, వాడవాడలా ఎర్రజెండాలను ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇసంపల్లి రాజేందర్, ఈదునూరి రామకృష్ణ, గుండేటి మల్లేశ్, చింతల శేఖర్, జె.తిరుపతి, ఒమాజీ, రాజేశ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కమిటీ కార్యదర్శి కడారి సునీల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్, ఆసుపత్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.ఐలయ్య, కార్యదర్శి వైనాల రవి, మల్లేశ్, నాయకులు పుష్ప, రాజేశ్వరి, మల్లమ్మ, కుమార్, రాజ్‌కుమార్, లక్ష్మి, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, స్వప్న, సరోజ, మౌనిక, గీత, కొండమ్మ, అంజన్న పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

జ్యోతినగర్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే విజయవంతం చేయాలని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. యూనియన్ నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, దండ రాఘవరెడ్డి, కాదాశి మల్లేశ్, రాజకుమార్, నారాయణరెడ్డి, రవి, భూమయ్య, వెంకన్న, పరమేశ్, భాస్కర్, సాంబయ్య, శ్రీనివాస్, వెంకన్న, శివపాల్ సింగ్ పాల్గొన్నారు.

మేడే విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: మే డే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్ కోరారు. శనివారం ఆర్జీ–2 పరిధి కాలనీలో విధులు నిర్వహిస్తున్న వివిధ సెక్షన్ల కార్మికులతో కలిసి మేడే పోస్టర్ ఆవిష్కరించారు. శారద, రాములు, మేరీ, లింగయ్య, లక్ష్మి, లత, శ్రీనివాస్, బాబు, కవిత, చలపతి నాయక్, నరేశ్, దుర్గేష్, పద్మ, వీరస్వామి, సమ్మయ్య పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

ఓదెల: అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అసిస్టెంట్ ఆఫీసర్, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య కోరారు. శనివారం ఓదెల మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పరిసరాలు, గదుల్లో వెలుతురు, భద్రత ఉందా అని ఆరా తీశారు. తహసీల్దార్ యాకన్న, ఆర్ఐలు బి.రాజేందర్, నర్సింగ్, కార్యదర్శులు ప్రసాద్, దిలీప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం



దర్శనానికి వచ్చిన భక్తులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల మానేటి శ్రీభూనీళా సమేత రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు 17 నుంచి ప్రారంభం కాగా శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, గోవర్ధనగిరి రాజ్‌కుమార్ ఆచార్యులు, నాయకులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, మహేందర్, దామోదర్‌రావు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకే మోదీ సర్కార్ అండ

పెద్దపల్లిరూరల్: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకే అండగా ఉంటూ కార్మిక, కర్షకులతో పాటు పేద ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తోందని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య అన్నారు. పెద్దపల్లిలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మనువాద ఫాసిజానికి వ్యతిరేకంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలన్నారు. టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణ్, హరగోపాల్, లక్ష్మణ్, కాశీం, యాదగిరి, నర్సింహారెడ్డి పాల్గొంటారని కొమురయ్య పేర్కొన్నారు.

ఉపాధి కూలీలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో అలీం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం ఎంపీడీవో ఎం.ఏ.అలీం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా పనివేళలను మార్చుకోవాలని సూచించారు. కూలీలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నిమ్మకాయ వంటి వాటిని అందుబాటులో ఉంచుకోవాలని, శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ నీరు తాగాలన్నారు. అనంతరం టీబీఎస్ అంతర్గాంలోని నర్సరీని సందర్శించారు. మొక్కలపై పచ్చగుడ్డ వేసి నీటితో తడపాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం 8గంటల లోపు మొక్కలకు నీరు అందించాలని ఆదేశించారు.

మాదిగలను మోసం చేసిన పార్టీకి బుద్ధి చెప్పండి

మంథని: మాదిగ కులస్తులంతా ఏకమై హామీలు ఇచ్చి మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పాలని స్వతంత్ర అభ్యర్థి కొంకటి లింగమూర్తి పిలుపునిచ్చారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేశాయన్నారు. మాదిగ రిజర్వేషనన్ చేస్తామని ఎన్నికల్లో హామీలిచ్చి ఓట్లు వేయించుకున్నారే తప్ప హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో మొరుగు వీరయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేశారు. శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభను నిర్వహించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అభినందన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేశ్, రామకృష్ణారెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



రామగుండం: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు నామాల రామకృష్ణ డాక్టరేట్ పొందినట్లు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు పరిశోధక విద్యార్థి నామాల రామకృష్ణ 'వరంగల్ జిల్లా పద్యకవులలో అల్లూరి రాజేశ్వర కవి జీవితం, సాహిత్యం–ప్రత్యేక అధ్యయనం' అనే అంశంలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేట్ గ్రామానికి చెందిన నామాల రామకృష్ణ రామగుండంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు.